



# 'డిజిటల్ అరెస్ట్' పేరుతో వృద్ధుని నుండి రూ.10.74 కోట్ల గుంజిన ఇద్దరు నిందితుల అరెస్టు

**ప్రజానావ, ముంబై:** 'డిజిటల్ అరెస్ట్' పేరుతో ఒక సీనియర్ సిటిజన్‌ను ఆన్‌లైన్‌లో మోసం చేసిన ఇద్దరు నిందితులను పూణే సైబర్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో సైబర్ పోలీస్ స్టేషన్‌లో ఇండియన్ పీనల్ కోడ్ ఐటీ చట్టం కింద కేసు నమోదు చేయబడింది. గుర్తు తెలియని నిందితులు సీబీఐ అధికారులుగా నటిస్తూ ఆ సీనియర్ పౌరుడిని 'డిజిటల్ అరెస్ట్' చేస్తామని బెదిరించారు. అతని ఆధార్ కార్డును దుర్వినియోగం చేయడం ద్వారా అతని పేరు మీద నకిలీ బ్యాంకు ఖాతా తెరిచారని, మోసం జరిగిందని ఫిర్యాదులు వచ్చాయని బెదిరించారు. ఈ కేసులో కుటుంబ సభ్యులను అరెస్టు చేస్తామని బెదిరించి, నిందితులు ఇచ్చిన ఖాతాలకు పెట్టుబడులన్నింటినీ బదిలీ చేయించుకున్నారు. ఈ బెదిరింపులకు భయపడి, ఫిర్యాది, నిందితులు ఇచ్చిన వివిధ బ్యాంకు ఖాతాల్లో మొత్తం రూ.10.74 కోట్ల జమ చేశాడు. సీనియర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ స్వప్నాలి షిండే సాంకేతిక విశ్లేషణ ద్వారా దర్యాప్తు నిర్వహించారు. సంబంధిత ఖాతాల నుండి ఏటిఎం ల ద్వారా డబ్బును ఉపసంహరించుకున్నట్లు తేలింది. సీసీ టీవీ ఫుటేజ్ ఆధారంగా, పోలీసులు ఉచ్చు బిగించారు. ఆపరేషన్‌లో, హర్షద్ సుభాష్ ధంతోలే (23) సమర్థ్ సురేష్ దేశ్‌ముఖ్ (24) లను అరెస్టు చేశారు . వారిద్దరూ ప్రస్తుతం పూణేలోని కార్వేనగర్‌లో నివసిస్తున్నప్పటికీ, వారు ఛత్రపతి సంభాజీనగర్‌కు చెందినవారని సైబర్ పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి రూ.40 లక్షల బ్యాంకు ఖాతా లు స్తంభింపజేసారు . రూ.4 లక్షల 78 వేల 500 నగదును స్వాధీనం చేసుకున్నారు. సైబర్ పోలీస్ స్టేషన్ తదుపరి దర్యాప్తు కొనసాగిస్తోంది. ఈ ఆపరేషన్ పూణే అదనపు పోలీస్ కమిషనర్ (క్రైమ్) పంకజ్ దేశ్‌ముఖ్ మరియు డిప్యూటీ పోలీస్ కమిషనర్ (ఎకనామిక్ అండ్ సైబర్) వివేక్ మసల్ మార్గదర్శకత్వంలో జరిగింది. ఈ విజయవంతమైన ఆపరేషన్ పెరుగుతున్న 'డిజిటల్ అరెస్ట్' కేసులకు వ్యతిరేకంగా పోలీసులకు ఒక పెద్ద పురోగతిని సాధించింది.

# కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన టీఎన్జీవోలు



**ప్రజానావ, కరీంనగర్:** నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కరీంనగర్ జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రాను కరీంనగర్ జిల్లా ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్, టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షులు దారం శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కు పుష్పగుచ్ఛం అందజేసి జిల్లా ఉద్యోగుల తరఫున హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. అనంతరం తెలంగాణ ఎన్జీవోల సంఘం 2026 సంవత్సర డైరీని అందజేశారు. అదే విధంగా మార్చి 7 న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక మంకమ్మతోటలోని టీఎన్జీవోల సంఘ భవనం లో నిర్వహించనున్న కార్యక్రమానికి కలెక్టర్ ను సాదరంగా ఆహ్వానిస్తూ ఆ రోజు రోజున మహిళా ఉద్యోగులకు ప్రత్యేక సెలవు ప్రకటించాలని కోరారు. అదే విధంగా ఉద్యోగుల సమస్యలపై కూడా చర్చించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి జిల్లా పరిపాలన ఎల్లప్పుడూ సహకరిస్తుందని కలెక్టర్ గారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు మడిపల్లి కాళీ చరణ్ ,అసోసియేట్ అధ్యక్షులు ఒంటెల రవీందర్ రెడ్డి, జిల్లా కోశాధికారి ముప్పిడి కిరణ్ కుమార్, రాష్ట్ర నాయకులు గూడ ప్రభాకర్ రెడ్డి, రాగి శ్రీనివాస్ సర్దార్ హర్మీందర్ సింగ్, మహిళా నాయకులు శారద, సునీత, సబిత, పట్టణ సంఘం అధ్యక్షులు మారుపాక రాజేష్ భరద్వాజ్, కార్యదర్శి వెలిచాల సుమంతరావు, రూరల్ అధ్యక్షులు కోడూరి వాస్తవిక్ గౌడ్, కార్యదర్శి కొమ్మెర శ్రీనివాస్ రెడ్డి, తిమ్మాపూర్ అధ్యక్షులు పోలు కిషన్, కార్యదర్శి నాగరాజు, నాయకులు కోట రామస్వామి, శంకర్ రమేష్ గౌడ్, ప్రసాద్ రెడ్డి, పాలవేడు శ్రీనివాస్, విజయలక్ష్మి, హరిప్రియ శైలజ, సరిత, స్వర్ణలత, రాజేష్ ,కరుణాకర్, లవ కుమార్, ప్రదీప్, పాండు, మల్కా రాజేశ్వరరావు, నగేష్ గౌడ్, శంషుద్దీన్, కయ్యం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# హత్యాయత్నం కేసులో రిమాండ్

**ప్రజానావ, సిరిసిల్ల:** అంబేద్కర్ నగర్‌కు చెందిన ఆకునూరి కళ్యాణ్ అనే యువకుడిపై హత్యాయత్నం చేసిన కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఆయన మంగళవారం మీడియాకు వివరించారు. ఫిబ్రవరి 27వ తేదీ అర్ధరాత్రి సమయంలో బీవైనగర్‌లోని జెండా గద్దె వద్ద ఆకునూరి కళ్యాణ్ తో ఏ1 మూల అభిలాష్, ఏ2 మొహమ్మద్ అబ్దుల్ ఆదీప్, కారంపూరి నికిత్ గొడవకు దిగారు. బాధితుడిని కులం పేరుతో దూషిస్తూ, చేతులతో విచక్షణారహితంగా కొట్టడమే కాకుండా.. బండరాళ్లతో తలపై, ఒంటిపై దాడి చేసి చంపేందుకు ప్రయత్నించారు. తీవ్ర గాయాలపాలైన కళ్యాణ్‌పరిస్థితిని గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి తల్లి ఆకునూరి పద్మ ఫిర్యాదు మేరకు 'హత్యాయత్నం','ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ' కేసులు నమోదు చేసినట్టు డీఎస్పీ తెలిపారు. నిందితులను అరెస్ట్‌చేసి, వారి నుంచి రెండు మోటార్ సైకిళ్లు, ఐదు మొబైల్ ఫోన్లు, దాడికి వాడిన బండరాళ్లను పోలీసులు స్వాధీనం చేసుకొని, రిమాండ్‌కు తరలించినట్టు డీఎస్పీ చెప్పారు.

# అసెంబ్లీ స్థాయి క్రీడోత్సవాలు ప్రారంభం

**ప్రజానావ, సిరిసిల్ల :** దేశ యువతలో క్రీడాస్ఫూర్తి పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రధానమంత్రి సంసద్ క్రీడా మహోత్సవం 2025–26 లో భాగంగా సిరిసిల్లలో క్రీడోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సోమవారం సిరిసిల్ల పట్టణ రాజీవ్ నగర్ మినీ స్టేడియంలో అసెంబ్లీ స్థాయి క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు జరిగిన వాలీబాల్ పోటీలో విన్నర్స్ గా ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామం టీం, రన్నర్స్ గా గంభీరావుపేట మండలం నర్మాల గ్రామ టీం విజేతలుగా నిలిచారు.' ఖో ఖో ' పోటీలో విన్నెర్స్ గా సిరిసిల్ల విజ్ఞాన్ స్కూల్ టీం, రన్నర్స్ గా సిరిసిల్ల బాలికల జడ్పీహెచ్ఎస్ పాఠశాల టీంలు విజయం సాధించాయి. 'కబడ్డీ' పోటీలో విన్నర్స్ గా ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి టీం, రన్నర్స్ గా గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేట గ్రామ టీం విజయం సాధించారు. ఈ సందర్భంగా విజేతలకు, రన్నర్స్ జట్లకు పట్టణ బీజేపీ అధ్యక్షులు దుమాల శ్రీకాంత్ అభినందనలు తెలిపారు. యువతలో క్రీడాస్ఫూర్తి పెంపొందించడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ మహోత్సవం ద్వారా గ్రామీణ ప్రతిభకు మంచి వేదిక లభించిందన్నారు.



విన్నర్స్, రన్నర్స్ జట్లకు మార్చి 5–7 తేదీలలో పార్లమెంట్ స్థాయి పోటీలు, మార్చి 8, 2026న కరీంనగర్‌లో బహుమతి ప్రదానోత్సవం నిర్వహించబడనున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కన్వీనర్ దుమాల శ్రీకాంత్, సౌళ్ళ క్రాంతి, కోడె రమేష్, రేపాక రామచంద్రారెడ్డి, లక్ పతి నాయక్, దాసరి పూర్ణిమ, మెరుగు శ్రీనివాస్, పల్లికొండ నరసయ్య, మెరుగు జితేందర్ రెడ్డి, చొప్పదండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్‌డే

### జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే

### 31 ఫిర్యాదులు స్వీకరణ

**ప్రజానావ,సిరిసిల్ల :** ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 31 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.



# నాగ్‌పూర్ ఎస్‌బిఎల్ పేలుడు కేసులో మృతుల సంఖ్య 19కి చేరిక

- **మృతుల వారసులకు 82 లక్షల పరిహారం.**
- **యజమానితో సహా 21 మంది అధికారులపై**
- **'హత్య' కేసు నమోదు; ఇప్పటివరకు 9 మంది అరెస్టు**





**ప్రజానావ, ముంబై:** నాగ్‌పూర్ జిల్లాలోని రౌల్‌గావ్‌లోని ఎస్‌బిఎల్ ఎనర్జీ లిమిటెడ్‌లో ఆదివారం ఉదయం జరిగిన భారీ పేలుడులో మరణించిన వారి సంఖ్య ఇప్పుడు 19 కి చేరుకుంది. చికిత్స పొందుతూ మరో గాయపడిన వ్యక్తి మరణించడంతో దిగ్భ్రాంతి నెలకొంది. పోలీసు యంత్రాంగం ఈ విషయంలో చాలా కఠినమైన వైఖరి తీసుకుంది.కంపెనీ యజమాని సంజయ్ చౌదరితో సహా 21 మంది సీనియర్ అధికారులపై భారత శిక్షాస్మృతి కింద నేరపూరిత హత్య కేసు నమోదు చేసారు. ఆదివారం రాత్రి నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్‌లో, పోలీసులు ఇప్పటివరకు 9 మందిని అరెస్టు చేశారు. ఇతరుల కోసం వెతుకుతున్నారు. పేలుడు తీవ్రత మరియు ప్రాణనష్టాన్ని పరిగణనలోకి తీసుకుని, పోలీసులు ఈ విషయంపై యుద్ధప్రాతిపదికన దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తు తర్వాత, కంపెనీ యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. దీని ప్రకారం, కంపెనీ యజమాని సంజయ్ చౌదరి, డైరెక్టర్ల బోర్డు, ప్లాంట్ హెడ్, ప్రాజెక్ట్ మేనేజర్, సూపర్‌వైజర్ మరియు సేఫ్టీ ఆఫీసర్ సహా 21 మందిపై కల్మేశ్వర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయబడింది. అరెస్టు చేసిన 9 మంది నిందితులపై ప్రస్తుతం సమగ్ర దర్యాప్తు జరుగుతోంది.

### జిల్లా పాలక మంత్రి తనిఖీ

ఈ విషయంపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సమగ్ర దర్యాప్తునకు ఆదేశించారు. మహారాష్ట్ర రెవెన్యూ మంత్రి, నాగ్‌పూర్ జిల్లా పాలక మంత్రి చంద్రశేఖర్ బవాంకులే, వ్యవసాయ శాఖ సహాయ మంత్రి ఆశిష్ జైస్వాల్ సంఘటనా స్థలాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. "రాష్ట్ర ప్రజల భద్రతతో, కార్మికుల జీవితాలతో ఆటలాడుకునే వారిని వదిలిపెట్టబోము" అని బవాంకులే హెచ్చరించారు. పోలీసు సూపరింటెండెంట్ హర్ష్ పోద్దార్ మార్గదర్శకత్వంలో బృందాలు మిగిలిన నిందితుల కోసం గాలిస్తున్నాయి. మృతుల వారసులకు మొత్తం రూ.82 లక్షల పరిహారం ప్రకటించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే పీఎస్ఓ, డిఐఎస్హెచ్, కార్మిక శాఖల అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ మంత్రి చంద్రశేఖర్ బవాంకులే స్పష్టమైన సంకేతాలు కూడా ఇచ్చారు. ఈ దురదృష్టకర సంఘటనలో 19 మంది కార్మికులు మరణించగా, 23 మంది గాయపడ్డారు. మృతుడి వారసులకు కంపెనీ రూ.75 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు, కేంద్ర ప్రభుత్వం రూ.2 లక్షలు కలిపి మొత్తం రూ.82 లక్షలు అందజేస్తుంది. గాయపడిన వారికి రూ.25 లక్షల సహాయం ప్రకటించారు, 70 శాతం కంటే ఎక్కువ కాలిన గాయాలతో తీవ్రంగా గాయపడిన 13 మంది పునరావాసం కోసం ప్రభుత్వం ప్రత్యేక పథకాన్ని అమలు చేస్తుంది. ముఖ్యంగా, కంపెనీ మూసివేయబడినంత వరకు, అన్ని కార్మికులకు పూర్తి జీతం చెల్లించబడుతుంది మరియు కంపెనీ తిరిగి తెరిచే ముందు అన్ని కార్మికులకు ప్రత్యేక నైపుణ్య అభివృద్ధి శిక్షణ అందించడం తప్పనిసరి చేయబడింది.

### పోస్ట్‌మార్టం, గుర్తింపు సవాలుగా మారింది.

ఆదివారం సాయంత్రం మృతదేహాల పోస్ట్‌మార్టం పూర్తయింది. మృతదేహాలను గుర్తించడం కష్టంగా ఉండటంతో, పోలీసులు మృతుల బంధువులను డిఎన్ఏ గుర్తింపు కోసం పిలిపించారు. సేకరించిన అన్ని నమూనాలను తదుపరి విశ్లేషణ కోసం అప్పగించారు.

### అసలు ఏం జరిగింది?

నాగ్‌పూర్‌లోని కల్మేశ్వర్ తాలూకా రౌల్‌గావ్‌లోని మందుగుండు సామగ్రి తయారీ సంస్థ అయిన ఎస్‌బిఎల్ ఎనర్జీ లిమిటెడ్ (గతంలో స్పెషల్ బ్లాస్ట్ లిమిటెడ్)లో ఆదివారం ఉదయం 7 గంటలకు భారీ పేలుడు సంభవించింది. 18 మంది కార్మికులు మరణించగా, అనేక మంది గాయపడ్డారు. గాయపడిన వారిలో చాలా మంది పరిస్థితి విషమంగా ఉంది. చికిత్స పొందుతూ మరొకరు మరణించడంతో మృతుల సంఖ్య ఇప్పుడు 19 కి చేరుకుంది.



## వైజ్ఞానంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

**ప్రజానావ, జైనూర్:** విద్యార్థులు వైజ్ఞాన శాస్త్రంపై ప్రత్యేక శ్రద్ధ వహించి నూతన ఆవిష్కరణల దిశగా ముందుకు సాగాలని జైనూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథరావు, సీఐ రమేష్ విద్యార్థులకు సూచించారు. సోమవారం జైనూర్ మండల కేంద్రంలోని కేరళ గ్రామర్ పాఠశాలలో జాతీయ సైన్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ శాస్త్రవేత్త సివి రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రాజెక్టులు, ప్రయోగాలను పరిశీలించి ప్రశంసించారు. విద్యార్థుల సృజనాత్మకత, ఆలోచనా శక్తి ఎంతో ఆకట్టుకుందని పేర్కొంటూ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ ఇందిరమ్మ, సర్పంచ్ కొడప ప్రకాష్, జైనూర్, సిర్పూర్(యు) ప్రభుత్వ ఆసుపత్రుల వైద్యులు ఉదయ్ కిరణ్, మండే మధుకర్, మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షుడు చెర్ల లక్ష్మణ్, సీనియర్ నాయకుడు మేశ్రం అంబాజీ, నాయకులు అజ్జులాల, షేక్ రహీం, షేక్ అబ్బు, షేక్ మజార్, బుతాలే కిరణ్, షఫీక్ అన్సారి, సూపర్‌వైజర్ సృజన, పాఠశాల కరస్పాండెంట్ షేక్ జమీల్, ప్రిన్సిపాల్ షేక్ అఖిల్, డైరెక్టర్ రిజ్వానా కౌసర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వెంకటేశ్వర ఆలయంలో అన్నదానం



**ప్రజానావ, వేంసూర్:** మండలంలోని కందుకూరు గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి తిరునాళ్ల మహోత్సవం సందర్భంగా మహా అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి దేవస్థానంలో స్వామి వారి కల్యాణం అంగరంగ వైభవంగా జరగగా, అనంతరం గ్రామ పురవీధుల గుండా భారీ ఊరేగింపు నిర్వహించారు. సోమవారం మధ్యాహ్నం దేవస్థాన అన్నదాన సొసైటీ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించి భక్తి పరవశంలో మునిగిపోయారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అన్నదాన సొసైటీ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీని కుటుంబ సమేతంగా కలిసిన డీసీసీ అధ్యక్షుడు




**ప్రజానావ, ఆదిలాబాద్:** వికారాబాద్ అనంతగిరి హిల్స్‌లో నిర్వహించిన కాంగ్రెస్ శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆదిలాబాద్ డీసీసీ అధ్యక్షులు నరేష్ జాదవ్ కుటుంబ సభ్యులతో కలిసి లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీను కలిశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాహుల్ గాంధీ, ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాల డీసీసీ నాయకులతో సమావేశమై పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలు, రాష్ట్రాల రాజకీయ పరిస్థితులపై దిశానిర్దేశం చేశారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కాంగ్రెస్ పార్టీని మరింత బలపర్చే దిశగా సూచనలు చేశారు. ఈ సమావేశం ద్వారా పార్టీ శక్తివంతం కోసం సమన్వయంతో పనిచేయాలని నాయకులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి




**ప్రజానావ, గుడిహత్నూర్:** జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ య-ువకులకు, ఆదివాసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఈనెల 10న జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు గుడిహత్నూర్ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ జాబ్ మేళాలో 50కు పైగా కంపెనీలు పాల్గొని 2వేలకు పైగా ఉద్యోగాలను అందించనున్నట్లు తెలిపారు. అభ్యర్థుల విద్యార్హతలు, నైపుణ్యాలు, ఇంటర్వ్యూలో ప్రతిభ ఆధారంగా నెలకు రూ.13వేల నుంచి రూ.40వేల వరకు జీతభత్యాలు ఉండనున్నట్లు పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంతో పాటు హైదరాబాద్, నిర్మల్, ఆర్మూర్, మంచిర్యాల్, ఉట్నూర్, నిజామాబాద్, మహారాష్ట్ర తదితర ప్రాంతాల్లో ఉద్యోగ అవకాశాలు లభించే అవకాశం ఉందని తెలిపారు. అభ్యర్థులు పోస్టర్‌లో ఇచ్చిన క్యూఆర్ కోడ్, ఆన్‌లైన్ లింక్ ద్వారా తమ వ్యక్తిగత వివరాలతో ముందస్తు నమోదు చేసుకోవాలని సూచించారు. నిరుద్యోగ యువతీ యువకులు తమ అర్హతలకు తగిన ఉద్యోగాలను ఎంపిక చేసుకుని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

# ఘనంగా కాముడు, హోలీ సంబరాలు





**ప్రజానావ, జైనూర్:** మండలంలోని మార్లవాయి గ్రామంలో ఆదివాసీలు తమ పూర్వీకుల సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా కాముడు- హోలీ పండుగను సోమవారం ఘనంగా నిర్వహించారు. హోలీ పండుగకు ఒక రోజు ముందుగానే ఈ వేడుకలను ప్రారంభించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి ఒక్కొక్కరు కలిసి పటేల్ ఇంటికి చేరుకొని ఎండిన కుడుకలను సమర్పించడం ఈ పండుగ ప్రత్యేకతగా నిలుస్తుంది. ఇలా కుడుకను అందించిన వారిని గ్రామ సభ్యులుగా గుర్తించి గ్రామంలోని సుఖదుఃఖాలలో కలిసి ఉండే బాధ్యతను స్వీకరించినట్టుగా భావిస్తారు. పటేల్ ఇంటి నుంచి గ్రామం అవతల ఉన్న వ్యవసాయ చేనులో సాయంత్రం సమయంలో సంప్రదాయ పద్ధతిలో కాముడు దహనం కార్యక్రమాన్ని ఆటపాటల మధ్య నిర్వహిస్తారు. ఈ సందర్భంగా "మాతారి- మాతరల్" పేర్లతో విభజించి ఎండిన కుడుకాలతో హారాలను తయారు చేసి వెదురు బొంగుతో తయారుచేసిన తడక మధ్య వేలాడదీస్తారు. వ్యవసాయంలో పండిన ధాన్యాలు, వంకాయలు, ఉల్లిగడ్డలు, వనమూలికలు, పువ్వులతో ప్రత్యేకంగా అలంకరిస్తారు. సాయంత్రం సంప్రదాయ పూజలు నిర్వహించి శృంగార పదాలతో కూడిన పాటల మధ్య "కామ దహనం" నిర్వహిస్తారు. ఇందులో ముందుగా పడే వస్తువును ఆధారంగా చేసుకొని ఆ సంవత్సరంలో వర్షపాతం, పంటలు, ఆరోగ్యం ఎలా ఉంటాయో అంచనా వేస్తారని ఆదివాసీల విశ్వాసం. రాత్రంతా ఆటాపాటలతో సంబరాలు జరుపుకున్న అనంతరం మరుసటి రోజు ప్రతి ఇంటికి వెళ్లి కామ దహనం బూడిదను ఇంటి ముందు చల్లడం ఆనవాయితీగా కొనసాగుతోంది. అనంతరం జాజిరి పాటలు పాడుతూ సహజ వనమూలికలతో తయారు చేసిన రంగులను చల్లుకుంటూ చిన్నా పెద్దా తేడా లేకుండా రెండు రోజుల పాటు హోలీ పండుగను ఆనందంగా జరుపుకుంటారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ తమ తాత ముత్తాతల నుంచి వస్తున్న ఈ సంప్రదాయాన్ని భవిష్యత్తు తరాలకు అందించడం తమ బాధ్యత అని తెలిపారు. ప్రకృతి, వనమూలికలు, జంతువులు, పంటలు అన్నీ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటూ ఈ పండుగను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. హోలీ పండుగ అనంతరం వ్యవసాయ పనులు ప్రారంభమవుతాయని, పెండ్లి పేరాటాలు వంటి శుభకార్యాలు కూడా ఈ పండుగ తర్వాతనే నిర్వహిస్తామని తెలిపారు.

# మున్సిపల్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడతాం

### ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్



**ప్రజానావ, సత్తుపల్లి:** మున్సిపల్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడతామని ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ అన్నారు. సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఎన్టీఆర్ కాలనీ, 8, 9వ వార్డుల్లో సోమవారం "స్పెషల్ డ్రైవ్" కార్యక్రమాన్ని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్‌తో కలిసి ప్రారంభించారు. సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ పార్టీ విజయం సాధించిన వెంటనే వంద రోజుల్లో మున్సిపాలిటీ అభివృద్ధి, పరిశుభ్రత కార్యక్రమాలను అమలు చేస్తామని చెప్పిన మాటను నిలబెట్టుకుంటూ ఈ స్వచ్ఛత కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఎన్టీఆర్ కాలనీలో పారిశుద్ధ్య పనులకు శ్రీకారం చుట్టి, ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం సత్తుపల్లి మున్సిపాలిటీ 7వ వార్డు రాజీవ్ కాలనీలో పలు ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. 13వ వార్డు జవహర్ నగర్ కాలనీలోని శ్రీ కృష్ణుని దేవాలయంలో శ్రీకృష్ణ పరమాత్మ, రుక్మిణి దేవి కళ్యాణ మహోత్సవ పూజా కార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రిహాన బేగం, వైస్ చైర్మన్ బొంతు సుమలత, ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, కౌన్సిలర్లు జగన్నాథం శ్రీను, శరత్, నజిమా షరీఫ్, ఉప్పు నాగలక్ష్మి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాదె చెన్నారావు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్‌లో వింత చలానా

### ఆగిన వాహనానికి సెల్‌ఫోన్ డ్రైవింగ్ అంటూ నోటీసులు

### పోలీసుల తీరుపై వాహనదారుడి నిరసన



**ప్రజానావ, ఆదిలాబాద్:** ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలను అరికట్టేందుకు పోలీసులు వినియోగిస్తున్న ఆన్‌లైన్ చలాన్ల విధానం కొన్నిసార్లు వాహనదారులకు చుక్కలు చూపుతోంది. తాజాగా, రోడ్డు పక్కన సురక్షితంగా వాహనాన్ని నిలిపి ఉంచి ఫోన్ మాట్లాడుతున్న ఓ వ్యక్తికి 'సెల్‌ఫోన్ రైడింగ్' కింద పోలీసులు చలాన్ జారీ చేయడం చర్చనీయాంశమైంది. బాధిత వాహనదారుడు తన పని నిమిత్తం వెళ్తూ ఫోన్ రావడంతో నిబంధనల ప్రకారం వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపివేశాడు. వాహనం కదలకుండా ఉన్న సమయంలోనే ఫోన్ మాట్లాడాడు. అయితే, అక్కడ ఉన్న ట్రాఫిక్ సిబ్బంది అతను ఫోన్ మాట్లాడుతున్న ఫోటోను తీసి, వాహనం నడుపుతూ ఫోన్ మాట్లాడుతున్నట్లుగా నిర్ధారించి భారీ జరిమానా విధిస్తూ చలాన్ పంపారు. సదరు చలాన్ చూసి విస్తుపోయిన వాహనదారుడు, ఆ ఫోటోను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తూ పోలీసులను సూటిగా ప్రశ్నించాడు. "ప్రియమైన చలాన్ పోలీసులు.. నా వాహనం రోడ్డు పక్కన నిలబడి ఉన్న స్థితిలో ఉంది. అలాంటప్పుడు దీన్ని 'సెల్‌ఫోన్ రైడింగ్'గా ఎలా పరిగణిస్తారు? దయచేసి దీనికి వివరణ ఇవ్వండి లేదా వెంటనే ఈ చలాన్‌ను రద్దు చేయండి" అంటూ తన ఆవేదన వ్యక్తం చేశాడు. మోటారు వాహనాల చట్టం ప్రకారం వాహనం నడుపుతున్నప్పుడు ఫోన్ వాడటం ప్రమాదకరం మరియు నేరం. కానీ, అత్యవసరమైతే వాహనాన్ని పక్కకు ఆపి ఫోన్ మాట్లాడుకోవడం సరైన పద్ధతి. ఇలాంటి సందర్భాల్లో కూడా జరిమానాలు విధిస్తే ప్రజలకు తప్పుడు సంకేతాలు వెళ్తాయని సామాజిక కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు. సాంకేతిక లోపాలు లేదా అత్యుత్సాహం వల్ల ఇలాంటి తప్పులు జరుగుతున్నాయని, ఉన్నతాధికారులు స్పందించి చలాన్‌ను సమీక్షించాలని బాధితుడు కోరుతున్నాడు.

# ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా 'హెల్త్ మిషన్



### జిల్లా కలెక్టర్ రాజర్షిషా

**ప్రజానావ, ఆదిలాబాద్:** రాష్ట్ర వ్యాప్తంగా ప్రజారోగ్యాన్ని మెరుగుపర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "హెల్త్ మిషన్-100" ప్రత్యేక ఆరోగ్య కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో అధికారులకు పలు సూచనలు చేశారు. ఈనెల 2 నుంచి జూన్ 9 వరకు కొనసాగే ఈ కార్యక్రమం ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, కౌమార దశలోని వారు, వృద్ధులకు నాణ్యమైన వైద్య సేవలను నేరుగా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ మిషన్ నాలుగు దశల్లో అమలవుతుందని పేర్కొన్నారు. మొదటి దశలో మాతా శిశు ఆరోగ్య సేవలు, పాఠశాల విద్యార్థుల హెల్త్ స్క్రీనింగ్, వృద్ధులకు ప్రత్యేక ఓపీ సేవలు అందించనున్నట్లు చెప్పారు. రెండవ దశలో 30 ఏళ్లు పైబడిన వారికి బీపీ, షుగర్, క్యాన్సర్ స్క్రీనింగ్, మూడవ దశలో క్షయ, హెచ్ఐవీ వంటి అంటువ్యాధుల నియంత్రణతో పాటు ఎండదెబ్బ నివారణపై అవగాహన కల్పిస్తారని అన్నారు. నాలుగవ దశలో పట్టణ ప్రాంతాల్లోని యూపీహెచ్‌సీలను పాలీ క్లినిక్‌లుగా అభివృద్ధి చేసి నిపుణుల వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు వివరించారు. 100రోజుల్లో రాష్ట్రంలోని లక్షలాది పొదుపు సంఘాల మహిళలకు డిజిటల్ హెల్త్ ప్రొఫైలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో మొబైల్ మెడికల్ యూనిట్ల ద్వారా ఇంటి వద్దకే వైద్య సేవలు అందించనున్నట్లు అన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి నరేందర్ రాథోడ్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

